అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

జనజాతర

దారులన్నీ మేడారం వైపే..

- సమ్మక్క - సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం
- నేటి నుంచి మహా జాతర ప్రారంభం
- గద్దెపై కొలువు దీరనున్న సారలమ్మ
- లక్షలాదిగా చేరుకుంటున్న భక్తులు
- మేడారం దారుల్లో భారీగా ట్రాఫిక్ జాం..

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి..

దారులన్నీ మేడారం వైపే.. వనమంతా జనసంద్రాన్ని తలపిస్తోంది.. వనదేవతలను సందర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ విదేశాల నుంచి భక్తులు భారీగా తరలొస్తున్నారు. జంపన్న వాగు జన ప్రవాహంతో పోటెత్తుతున్నది. కీకారణ్యం జనారణ్యమై కోలాహలంగా మారింది. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింభించే తెలంగాణ కుంభమేళా (మేడారం మహాజాతర) బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. మాఘమాసం పౌర్ణమి రోజుల్లో ఏటా రెండేళ్లకోసారి ఈ జాతర ఆనవాయితీగా వస్తోంది. బుధవారం జాతరకు అంకురార్పణ జరగనున్నది. వనం వీడి జనం మధ్యకు వచ్చే వనదేవతల ఆగమనంతో అసలైన మహాజాతర మొదలవుతుంది. ఇసుక వేస్తే రాలనంత జనం జేజేల మధ్య సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల ఆగమనం మొదలుకానుంది. జాతర కోసం ముందుగా మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజు డప్పువాయిద్యాలు, శివసత్తుల నృత్యాల మధ్య నేడు కోలాహలంగా మేడారానికి తీసుకొస్తారు. పూనుగొండ్ల నుంచి ప్రారంభమైన స్వామి వారి ఊరేగింపు గ్రామ పురవీధుల్లో సందడిగా సాగుతుంది. అటవీ మార్గంలో 70 కిలోమీటర్ల మేర కాలి నడకన బయలుదేరి స్వామి మేడారానికి విచ్చేస్తారు. ఆ సమయంలోనే కన్నెపల్లి నుంచి సారలమ్మ తల్లి, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులు కూడా మేడారం చేరుకుంటారు. జాతర రెండవ రోజు గురువారం రోజున సమ్మక్క తల్లి ఆగమనమే తరువాయి లక్షలాది మంది భక్తుల కోలాహలం నడుమ సమ్మక్క తల్లి గౌరవంగా గద్దెలపైకి వస్తుంది. జాతర మూడో రోజున దేవతలంతా గద్దెలపై ఉండి భక్తులకు దర్శనం ఇస్తారు. శనివారం రాత్రి దేవతలు తిరిగి వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది. మేడారం మహా జాతరకు ముందే 50 లక్షలకు పైగా భక్తులు దేవతలను దర్శించుకున్నారు.



ఆరువేల బస్సులు

మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా ఆరువేల బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల ద్వారా దాదాపుగా 35 లక్షల మంది భక్తులను తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా , హైదరాబాద్ నుంచి మేడారం వరకు వీఐపీ దర్శనం చేయించి, మళ్లీ హైదరాబాద్ లో దించే హెలికాప్టర్ సర్వీసులను భక్తుల సౌకర్యార్థం పర్యాటకశాఖ ఏర్పాటు చేసింది. దేశంలో ఈ స్థాయిలో జరిగే మరే జాతరలో కూడా హెలికాప్టర్ సర్వీసులు లేవు. మేడారం జాతరలో మాత్రం ఐదోసారి హెలికాప్టర్ సేవలను ఏర్పాటు చేసింది.